వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు

- రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు
- రహదారి పైనే నిర్మాణాలు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మిర్యాలగూడ అర్బన్: ట్రాఫిక్ సమస్యతో మిర్యాలగూడ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని సాగర్‌రోడ్డు, పెద్దబజార్, చర్చి బజార్, రైతు బజార్ ప్రాంతాలు నిత్యం రద్దీగా ఉంటూ ట్రాఫిక్ జాం అవుతోంది. ఈ ట్రాఫిక్‌కు తోడు చిరు వ్యాపారులు రోడ్డుపైనే తమ వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రైతు బజార్ ఆర్టీసీ బస్టాండ్‌కు పక్కనే ఉండటంతో నిత్యం మిర్యాలగూడ పట్టణంలోని ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి సైతం ఇక్కడకు వచ్చి తమకు కావాల్సిన సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసి బస్టాండ్‌కు చేరుకునే వెసులుబాటు ఉంది. కానీ నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండటంతో వాహనాదారుల అవస్థలు వర్ణణాతీతం.

రోడ్డును ఆక్రమించి..

మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన వీధుల్లో చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా భవనాలను నిర్మిస్తున్నారు. రోడ్డు నుంచి కనీసం ఆరు ఫీట్లు వదిలి భవనాలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ పలువురు మాత్రం రోడ్డుకు ఆనుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఆ భవనాల వద్ద వాహనాలు కూడా నిలపడానికి స్థలం లేక రోడ్లపైనే వాహనాలను పెడుతున్నారు. దీంతో ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది.



రైతు బజార్ వద్ద రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

ఇంత జరుగుతున్నా సంబధిత అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్‌కు వెళ్లే దారిలో ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులు నడిరోడ్డుపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి రోడ్డుపైనే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రైతు బజార్‌లో వ్యాపారులకు స్టాళ్లు ఏర్పాటు చేసినా.. కొంతమంది రైతు బజార్ బయట రోడ్డు పైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. రైతు బజారు ఎదురుగానే ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ ఉండటం, ఆ కాంప్లెక్స్‌లో కిరాణా దుకాణాలు ఉండటంతో ఎక్కువగా ఈ రోడ్డుకే ప్రజలు వస్తుంటారు. ఇదే రోడ్డులో చిరు వ్యాపారులు రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకుని తమ సరుకులను రోడ్డుపై పెట్టి విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న వారితో పాటు రైతు బజార్‌లో స్టాళ్లు ఉన్నా.. రోడ్లపైనే కూరగాయాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులు

ఇబ్బందులు లేకుండా చూస్తాం



పట్టణంలోని ప్రధాన వీధులతో పాటు రైతు బజార్ వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న విషయం మా దృష్టిలో ఉంది. రోడ్లపై పలువురు వ్యాపారులు విక్రయాలు చేపట్టకుండా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటాం. వారిపై కేసులు సైతం నమోదు చేస్తాం. మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– మోహన్‌బాబు, ట్రాఫిక్ ఎస్‌ఐ

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు ఉపాధిని కోల్పోతున్నారని, ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని బీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ వాజిద్ అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చెన్నయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా లక్షలాది మంది ఆటో డ్రైవర్లు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. నూతన ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తే ఉపాధి కోల్పోయే విధంగా చేస్తుందని అనుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆటో కార్మికులకు నెలకు రూ.15వేల జీవన భృతి, సంవత్సరానికి రూ.12వేలు అందించాలని, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో డ్రైవర్లకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పర్వేజ్, జహంగీర్, రాములు, సుందర్, సోమయ్య, ధనమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి..

మిర్యాలగూడ టౌన్: మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగుల సైదులుగౌడ్ అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరాకీలు లేక ఆటో కార్మికులు కిస్తీలు, ఇంటి అద్దెలు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం దీనికి ఏదో ఒక పరిష్కార మార్గం చూపాలన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు కర్నాటి శివరామకృష్ణ, మనోహర్ తదితరులున్నారు.



మిర్యాలగూడ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ


డిండి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద విద్యార్థులకు యూత్ ఫర్ సేవా ఆర్గనైజేషన్, హైదరాబాద్ వారు శనివారం ఉచితంగా స్కూల్ బ్యాగులు, స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీటీసీ ఏటి.రాధికాకృష్ణ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు అందజేయడం అభినందనీయమని, దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకొని నిరుపేద విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పెంటావతి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, ఆర్గనైజేషన్ వలంటీర్లు రాఘవ, అమృత్, రామకృష్ణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ బ్యాగులు అందజేస్తున్న యూత్ ఫర్ సేవా ఆర్గనైజేషన్ సభ్యులు

యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయాలి

పెద్దవూర: ఈ యాసంగి సీజన్‌లో రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి కె. సందీప్‌కుమార్ అన్నారు. శనివారం పెద్దవూర మండల కేంద్రంలోని రైతు వేదికలో యాసంగిలో సాగు చేసుకోవాల్సిన పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో భూగర్భ జలాలు తగ్గాయని, దీంతో తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. నేల స్వభావం ఆధారంగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలైన వేరుశనగ, మినుములు, అలసందలు, కందులు, పెసర, శనగ పంటలను సాగు చేసుకోవాలని అన్నారు. సమావేశంలో ఏఈఓ ఆంజనేయులు, రైతులు కర్నాటి లక్ష్మారెడ్డి, సైదిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఓ సందీప్‌కుమార్

ఆంజనేయస్వామి ఆలయం ఎదుట నిరసన



ఆలయం ఎదుట నిరసన తెలుపుతున్న స్థానికులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పాత ఊరిలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయం ఎదుట శనివారం స్థానికులు నిరసన తెలిపారు. మూడు నెలల నుంచి దేవాలయంలో ఎలాంటి ధూప దీప నైవేద్యం పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధూప, దీప నైవేద్యానికి ప్రతి నెల రూ.10వేలు ప్రభుత్వం దేవాలయానికి ఇస్తున్నప్పటికీ ఆలయ పూజారి మూడు నెలల నుంచి దీపారాధన చేయడం లేదని ఆరోపించారు. ఇందుకుగాను శ్రీసీతారామచంద్రమౌళీశ్వరస్వామి అయ్యప్పస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ నాయిని మాధవరెడ్డి, కమిటీ సభ్యులు, పూజారిపై చర్యలు తీసుకొని, దేవాలయంలో నిత్యం దీపారాధన జరిగేలా చూడాలన్నారు. నిరసన తెలిపిన వారిలో ఇమ్మడి రమేష్ గౌడ్, బోడ కృష్ణ, నరేందర్ తదితరులున్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి

పెద్దవూర: చదువుకు పేదరికం అడ్డుకాదని, బాలికలు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. శనివారం పెద్దవూర మండలంలోని పులిచర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమసమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని అన్నారు. బాలికలు స్వయం సమృద్ధి సాధించాలని పేర్కొన్నారు. గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు పురుషులకు దీటుగా అన్నిరంగాల్లో రాణిస్తుండటం హర్షనీయమన్నారు. ప్రభుత్వాలు సైతం మహిళల సంక్షేమానికి పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. బాల్యవివాహాలు, ఆడపిల్లల విక్రయం చట్టరీత్యా నేరమని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. వెంకాయమ్మ, అంగన్‌వాటీ టీచర్లు బి. నివేదిత, నాగమణి, రాజ్యలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, ఎం. వీరారెడ్డి, సీహెచ్ సైదులు, రాములు, మధుబాబు, అరవింద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి

మిర్యాలగూడ: విద్యార్థుల్లో దాగి ఉన్న కొత్త కొత్త ఆవిష్కరణలను, నైపుణ్యాలను వెలికితీయాలని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత సీహెచ్. సందీప అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని మీనా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో క్రాఫ్ట్–నైపుణ్యత, సృజనాత్మకత అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు ఇష్టంతో చదవడం వలన నూతన ఆవిష్కరణలు చేయవచ్చని అన్నారు. పేపర్, వివిధ వస్తువులను ఉపయోగించి అందమైన అలంకరణ వస్తువులను తక్కువ ఖర్చుతో ఎలా తయారు చేయవచ్చో ఆమె వివరించారు. కళాశాల చైర్మన్ ఎండీ మహమ్మద్ అలీ మాట్లాడుతూ.. విద్యార్థినిల్లోని మేధోశక్తిని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ షహలాబుతుల్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాణి, సుబ్బరాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పేపర్‌తో అలంకరణ వస్తువులు తయారుచేయడాన్ని వివరిస్తున్న సందీప

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజలు



మిర్యాలగూడలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఐసీడీఎస్ కార్యాలయం

మిర్యాలగూడ టౌన్: పట్టణంలో చాలా వరకు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ప్రభుత్వం అద్దె రూపంలో లక్షలాది రూపాయలను చెల్లిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పట్టణ, రూరల్ కార్యాలయాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, వాహన తనిఖీల డివిజనల్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్, కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం, ఎస్సీ సహాయ సంచాలకుల కార్యాలయంతో పాటు ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వీటికి ప్రతి నెలా వేలాది రూపాయలను అద్దె రూపంలో చెల్లిస్తున్నారు. ప్రజలకు ఏదైనా అవసరం పడి సంబంధిత కార్యాలయాలకు వెళ్లాలంటే ఎక్కడో గల్లీల్లో ఉంటుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు మారినా ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోవడంతో ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించుకునే అవకాశం లేకుండా పోయింది. అధికారులు మాత్రం ప్రభుత్వ భూములు పెద్ద ఎత్తున కబ్జాలకు గురి అవుతున్నప్పటికి పట్టించుకోకుండా అద్దె రూపంలో మాత్రం పెద్ద మొత్తంలో చెల్లిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాలికలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ



ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతిని సన్మానిస్తున్న మహిళలు

నాగార్జునసాగర్: జీవితంలో తమ సొంత కాళ్లపై నిలబడేందుకు గాను బాలికలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. శనివారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కిషోర బాలికలకు బ్యూటీషియన్ కోర్సును ఆమె ప్రారంభించి మాట్లాడారు. కిశోర బాలికలతో పాటు చదువు మానేసిన వారు కూడా శిక్షణ తీసుకోవచ్చని తెలిపారు. 30మంది కిషోర బాలికలకు నెలరోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గౌసియా బేగం, వెంకాయమ్మ, శారదాదేవి, ఉమాదేవి, రాజేశ్వరి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్



డ్యాన్స్ చేస్తున్న అభ్యాస్ పాఠశాల విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని అభ్యాస్ పాఠశాలలో శనివారం ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వంగాల నిరంజన్‌రెడ్డి, డైరెక్టర్ వంగాల పుష్పలత, ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, అనిత, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పునరుద్ధరించాలి

హుజూర్‌నగర్ : గత ప్రభుత్వంలో పనిచేసిన హౌసింగ్ బోర్డు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించాలని పూర్వ ఉద్యోగుల యూనియన్ నాయకులు శనివారం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేసిన తమను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలగించిందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించి తమను ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు మహమ్మద్ ఖలీద్ , గంజి శివ, బానోతు వెంకటేశ్వర్లు, బండారు మురళి, షేక్ రఫీ, గోలి శంబయ్య తదితరులు పాల్గొన్నారు .



మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పూర్వ ఉద్యోగులు

దళితుడిని అసెంబ్లీ స్పీకర్‌గా చేయడం హర్షణీయం

నాగార్జునసాగర్: దళితుడైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అసెంబ్లీ స్పీకర్‌గా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నామ లింగయ్య అన్నారు. శనివారం నాగార్జునసాగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడినప్పటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో దళితులకు పదవులు దక్కలేదని అన్నారు. దళితుడిని స్పీకర్‌గా చేసిన కాంగ్రెస్ పార్టీకి మాలమహానాడు తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.



నామ లింగయ్య

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కనగల్ : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రెడ్‌క్రాస్ యూత్ జిల్లా కోఆర్డినేటర్ మాద్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జి యడవల్లి గ్రామంలో ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ డిజిబిలిటీస్ సీనియర్ సిటీజన్స్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, మొబైల్ మెడికేర్ యూనిట్ (ఎంఎంయూ) ప్రాజెక్ట్ వారు సంయుక్తంగా 60సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నల్లగొండ బ్రాంచ్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రెండు నెలల నుంచి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో వివిధ గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో గ్రామంలోని వృద్ధులు స్వచ్ఛందంగా వచ్చి వైద్యులకు ఆరోగ్య సమస్యలు తెలియజేస్తున్నారని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 53మంది వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ ఆకుల శశిధర్, రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ రిటైర్డ్ డాక్టర్ ఎన్ సీవీ రాములు, గ్రామ సర్పంచ్ యాదమ్మమారయ్య, రెడ్ క్రాస్ యూత్ వలంటీర్ వెన్నమల్ల అంజయ్య, కట్ట నాగరాజు, కర్నాటి సర్దార్ లింగాచారి, సురేష్, రెడ్‌క్రాస్ సిబ్బంది సద్దాం హుస్సేన్, శ్రీనివాస్, శ్రీకాంత్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కనగల్: వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

నల్లగొండ టౌన్: వినికిడి పరీక్షల ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రావ్య స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నీలకంఠం రమ్య అన్నారు. శనివారం పట్టణంలోని రెడ్‌క్రాస్ కాంప్లెక్స్‌లో గల శ్రావ్య స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో ఆమె ఉచితంగా 56మందికి వినికిడి పరీక్షలను నిర్వహించారు. అనంతరం అవసరమైన సీనియర్ సిటిజన్స్‌కు, తెల్లరేషన్ కార్డులు కలిగిన వారికి రాయితీపై వినికిడి యంత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివారం, సోమవారం కూడా తమ సెంటర్‌లో ఉచితంగా వినికిడి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆడియాలజిస్టు సంతోష్‌కుమార్, స్వప్న, పార్వతి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ‘దివీస్’ సహకారం అభినందనీయం

చిట్యాల: గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి దివీస్ పరిశ్రమ యజమాన్యం అందిస్తున్న సహకారం అభినందనీయమని సర్పంచ్ రత్నం పుష్ప అన్నారు. శనివారం మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్, మండల పరిషత్ పాఠశాలల్లోని విద్యార్థులకు దివీస్ పరిశ్రమ యజమాన్యం రూ.2,98,552తో ఏర్పాటు చేసిన స్కూల్ బ్యాగులను, చెప్పులను ఆమె అందజేసి మాట్లాడారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు కొండకింది అంజిరెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్లు బి.నర్సింహ, బి.మధుసూదన్, దివీస్ పరిశ్రమ సీఎస్ఆర్ ఇన్‌చార్జ్‌లు వల్లూరి వెంకటరాజు, ఎస్.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్యాగులు, చెప్పులు అందజేస్తున్న నాయకులు

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

మిర్యాలగూడ టౌన్: ధనుర్మాసోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. దీంతో మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల శ్రీఅలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, పెద్దబజారులో గల శ్రీరామాలయం తదితర దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు. ఆయా దేవాలయాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

సత్తయ్య సేవలు మరువలేనివి

మునుగోడు : సీపీఎం పార్టీ బలోపేతానికి సత్తయ్య చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు బోడిష సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆయన స్మారకార్థం నిర్మించిన స్థూపాన్ని శనివారం సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు మాలిగ యాదయ్య, నాయకులు నాంపల్లి చంద్రమౌళి, సాగర్ల మల్లేష్, మొగుదాల వెంకటేష్, వరికుప్పల ముత్యాలు, ధనంజయ్య, మందుల పాండు, యసరాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంకీర్తనలు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని రామాలయంలో శనివారం అన్నమాచార్య సంకీర్తన ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తన విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయ గాయకులు వెంపటి గాయత్రి, సర్వజ్ఞలు చేసిన సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీహెచ్. శివరామకృష్ణ, రాజ్యలక్ష్మి, లక్ష్మీప్రసన్న, జానకి, మోహన్‌శర్మ, భార్గవి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గానం చేస్తున్న గాయకులు గాయత్రి, సర్వజ్ఞ

క్లుప్తంగా

వైభవంగా మండల పూజ



అయ్యప్ప స్వామికి అభిషేకం చేస్తున్న మాలధారులు

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం అయ్యప్ప స్వామి మండల పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రణవ పతాక ఆవిష్కరణ, సర్వ దేవతా పూజలు, గణపతి హోమం, అభిషేకం, సహస్ర అర్చన, మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి చిట్టెడి ప్రభాకర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, లింగయ్య, సుదర్శన్‌రెడ్డి, బోడ కుమార్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ పండుగ



మహాలక్ష్మమ్మ పండుగలో పాల్గొన్న భక్తులు

చందంపేట: మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో శనివారం మహాలక్ష్మమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నియమ నిబంధనలు పాటిస్తూ ఈ పండుగను జరుపుకుంటామని గ్రామస్తులు పేర్కొన్నారు.

బీసీ ఐఏఎస్, ఐపీఎస్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్: బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు నూతన ప్రభుత్వం ప్రాధాన్యత గల పోస్టుల్లో అవకాశం కల్పించాలని, సీఎం కార్యాలయంలో కూడా బీసీ ఐఏఎస్‌లను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ ఐఏఎస్‌లకు తగిన ప్రాధాన్యత కల్పించలేదని, కేవలం కొన్ని వర్గాల వారికే ఉన్నత స్థాయి పోస్టులను ఇచ్చిందని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్‌లను సైతం ప్రాధాన్యత గల పోస్టులు, సీఎం పేషీలో నియమించుకొని, బీసీలను చిన్నచూపు చూశారని ఆరోపించారు. కేసీఆర్ బీసీ ఐఏఎస్, ఐపీఎస్‌లను అవమానించారని, అలాంటి పని కాంగ్రెస్ ప్రభుత్వం చేయదన్న నమ్మకం ఉందని అన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టిని సారించాలన్నారు.


బాల్య వివాహాలపై అవగాహన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ

మాడుగులపల్లి: బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మాడుగులపల్లి మండలంలోని ఇందుగుల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శనివారం బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు, వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, గుడ్ టచ్–బ్యాడ్ టచ్ తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, రజిని, హెచ్‌ఎం రమణారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సునంద, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డాహిల్ హైస్కూల్‌లో డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మిర్యాలగూడ అర్బన్: విజయ్ దివస్‌ను పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణంలోని డాహిల్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు సైనికుల త్యాగాలను తెలుసుకోవడంతో పాటు దేశభక్తి పెంపొందించుకోవాలని అన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. శ్రీకాంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.